క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరంలాంటిదని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. మండలంలోని దామరంచ గ్రామానికి చెందిన నాగభూషణం అనారోగ్యానికి గురయ్యాడు. వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా, రూ.22 వేలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కును శుక్రవారం లబ్ధిదారుడికి ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయభాస్కర్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భూపాల్ రెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నర్సాపూర్: మండలంలోని ఆవంచ గ్రామానికి చెందిన విద్యార్థిని స్వాతి శుక్రవారం ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. నర్సాపూర్‌లోని బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో సీటు ఇప్పించినందుకు ఆమె తన తల్లిదండ్రులతో పాటు సర్పంచ్ కరుణాకర్‌తో కలిసి శుక్రవారం హైదరాబాద్ వెళ్లి ఎమ్మెల్యేని సన్మానించింది.

దరఖాస్తుల వెల్లువ



జిరాక్స్ సెంటర్ వద్ద రద్దీగా ప్రజలు

నర్సాపూర్: ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు వస్తూనే ఉన్నాయి. శుక్రవారం సైతం ప్రజలు పెద్ద ఎత్తున దరఖాస్తులు అందజేశారు. సొంత స్థలం ఉన్న పేద వారికి ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ద్వారా ఆర్థికసాయం చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా ప్రకటన వెలువడినప్పటి నుంచి ప్రజలు తమ దరఖాస్తులను అధికారులకు అందిస్తూనే ఉన్నారు. కాగా గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసేందుకు ప్రజలు పలు డాక్యుమెంట్లను జిరాక్స్ తీసేందుకు జిరాక్స్ సెంటర్ల వద్ద బారులు తీరుతున్నారు. కాగా శుక్రవారం 270 దరఖాస్తులు అందాయని ఎంపీఓ శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటి వరకు 1020 దరఖాస్తులు వచ్చాయని, వారానికి ఓసారి ఆర్డీఓకు దరఖాస్తులను పంపుతామని వివరించారు.

ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు గడువు పొడిగింపు

నర్సాపూర్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశాల గడువు పొడిగించినట్లు నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ ప్రిన్సిపాల్ దామోదర్, కోఆర్డినేటర్ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్లకు ఈనెల 16 వరకు గడువు పెంచినట్లు తెలిపారు. అన్ని దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓపెన్ డిగ్రీలో చేరాలంటే ఇంటర్మీడియట్/ఓపెన్ ఇంటర్/ పాలిటెక్నిక్/ఐటీఐ పాసై ఉండాలన్నారు. పూర్తి సమాచారం కోసం 73829 29736, 94415 41700 నంబర్లలో సంప్రదించాలని చెప్పారు.

'ఇబ్బందులు పెట్టకుండా పనిచేయండి'

రామాయంపేట(మెదక్): ట్రాన్స్‌కో సిబ్బంది వినియోగదారులను ఇబ్బందులకు గురిచేయకుండా పని చేయాలని వినియోగదారుల ఫోరం చైర్మన్ దిలీప్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ట్రాన్స్‌కో శాఖ వారు శుక్రవారం కార్యాలయం ఆవరణలో వినియోగదారుల ఫోరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారులు పలు ఫిర్యాదులు చేశారు. అనంతరం దిలీప్‌కుమార్ మాట్లాడుతూ.. రాంగ్ రీడింగ్, పేర్లు మార్పు, కొత్త సర్వీసుల విషయమై ట్రాన్స్‌కో సిబ్బంది వినియోగదారులను ఇబ్బందులకు గురిచేయకుండా పని చేయాలని సూచించారు. తాము ఇచ్చిన ఆర్డర్ నచ్చకపోతే వినియోగదారులపై అధికారులకు దరఖాస్తు చేసుకునే వెసులు బాటు ఉంటుందన్నారు. విద్యుత్ ప్రమాదాలు, చోరీ కేసులు తమ పరిధిలోకి రావని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు నాగేశ్వర్‌రావు, శోభ, వెంకట్, ఏడీఈ సుధాకర్, ఏఈ పెంట్యా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించామని మున్సిపల్ కమిషనర్ జానకీరాం సాగర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీఓ నెం.40 ప్రకారం పట్టణంలో 120 మైక్రాన్‌ల కన్న తక్కువ మందం గల సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వస్తువులు క్యారీ బ్యాగులు, గ్లాస్‌లు, ప్లేట్లు, స్ట్రాలు, స్పూన్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లు వాడకూడదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వాడిన వారికి రూ.5వేల నుంచి రూ.25వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

దళితబంధు అందరికీ ఇవ్వాలి

- ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన
- బీదోళ్లకు పథకాలు వర్తించవా ?
- అందుబాటులో లేని అధికారి



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మర్పల్లి గ్రామ దళితులు

రేగోడ్(మెదక్): దళితబంధు అందరికీ ఇవ్వాలని మండల కేంద్రం రేగోడ్‌లోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. మర్పల్లి గ్రామానికి చెందిన సుమారు 30 మంది దళితులు తమ బాధను చెబుదామనుకున్నా, ఎంపీడీఓ అందుబాటులో లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. దళితబంధు అందరికీ రావాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదోళ్లకు దళితబంధు ఇవ్వడం లేదని, ఉన్నోళ్లకే దళితబంధు ఇస్తున్నారని చెప్పారు. బతుకు తెరువు కోసం పట్టణాలకు వెళ్లామని, రైతుబంధు ఇస్తే ఉపాధి పొందుతామని పలువురు వాపోయారు. పదిహేను గుంటలు ఉన్న వారి కంటే పదేకరాల భూమి ఉన్న వారికి దళితబంధు ఇస్తారా.. అని ప్రశ్నించారు. గ్రామంలో 9 మందికి ఎంపిక చేశారని, అర్హులను ఎందుకు ఎంపిక చేయడం లేదని మండిపడ్డారు. గ్రామానికి వచ్చిన దళితబంధు యూనిట్లను అందరికి ఇవ్వాలని సూచించారు. బీదోళ్లకు సంక్షేమ పథకాలు వర్తించవా అన్నారు. ఎంపీడీఓ అందుబాటులో లేకపోవడంతో జూనియర్ అసిస్టెంట్ కేశయ్యకు వినతిపత్రం అందజేశారు. పై విషయమై ఎంపీడీఓ సీతారావమ్మను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా స్పందించలేదు.

ట్రిపుల్‌ఆర్‌కు భూములు ఇవ్వం

- రత్నాపూర్ గ్రామస్తులు



ఆర్డీఓ ఎదుట భూ నిర్వాసితుల ఆవేదన

శివ్వంపేట(నర్సాపూర్): ఆర్ఆర్ఆర్‌కు భూములు ఇచ్చేది లేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని రత్నాపూర్ గ్రామంలో ఆర్ఆర్ఆర్ కోసం భూసర్వే చేసేందుకు శుక్రవారం నర్సాపూర్ ఆర్డీఓ శ్రీనివాసులు భూ నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఉన్న కొద్దిపాటి భూములు సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని, అలాంటి సాగు భూముల్ని రోడ్డు కోసం తీసుకుంటే రోడ్డున పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు తీసుకోవద్దంటూ ఆర్డీఓ కాళ్లపై పడి ప్రాధేయపడ్డారు. కచ్చితంగా తీసుకోవాలంటే భూమికి బదులు భూమి ఇవ్వాలని లేదా మార్కెట్ ధర చెల్లించాలన్నారు. నామమాత్రం పరిహారం ఇచ్చి భూములు లాక్కుంటామంటే ఆత్మహత్యలే శరణ్యమన్నారు. రైతులు తీసుకొచ్చిన అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఆర్డీఓ చెప్పారు. దీంతో ఎలాంటి సర్వే పనులు చేపట్టకుండానే అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

బాల్య వివాహాలను నివారించాలి



మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధి మమత

నర్సాపూర్ రూరల్: బాల్య వివాహాలను అరికట్టాలని కర్పెడ్ సంస్థ ప్రతినిధి మమత అన్నారు. మండలంలోని చిప్పల్‌తుర్తిలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు కర్పెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ ఆమె మాట్లాడుతూ.. 18 ఏళ్ల లోపు అమ్మాయిలు 21 ఏళ్ల లోపు అబ్బాయిలు పెళ్లికి దూరంగా ఉండాలన్నారు. ఆ లోపు పెళ్లిళ్లు చేసుకుంటే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే చైల్డ్ లైన్ 10 లేదా పోలీసులకు 100 నంబర్లకు డైల్ చేసి సమాచారం ఇవ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు మమత, జబీనా, గీతాంజలి, విశాలాక్షి, కవిత, జోత్స్న పుణ్యవతి, జ్యోతి పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి లక్ష్యంగా చేరికలు

- ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



ఎమ్మెల్యేతో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ శ్రేణులు

మెదక్ మున్సిపాలిటీ: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరడం అభినందనీయమని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం హవేళీఘనాపూర్, మెదక్ మండలంలోని నాగపూర్, తిమ్మానగర్, మక్తభూపతిపూర్ గ్రామాలకు చెందిన 100 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయా గ్రామాలకు చెందిన వారందరూ మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం మండలాధ్యక్షులు సీహెచ్ శ్రీనివాస్‌రెడ్డి, అంజాగౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి, నాగపూర్ గ్రామాధ్యక్షుడు రాములు, పీఏసీఎస్‌వైఎస్ చైర్మన్ శ్రీహరి, వైస్ చైర్మన్ శంకర్, మక్త భూపతిపూర్ సర్పంచ్ నర్సింలు, నాయకులు ఆనంద్, రాంచంద్రారెడ్డి, సాయిలు, సాంబశివరావు, బాలయ్య, ఆంజనేయులు, శ్రీనివాస్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): కమీషన్ పెంపు విషయమై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం మండల రేషన్‌డీలర్లు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని, సలహాదారుడు దేవేందర్‌రెడ్డిని సన్మానించారు. ఈ మేరకు ఆమె నివాసంలో డీలర్లు పలు విషయాలపై ఎమ్మెల్యేతో చర్చించారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం మండలాధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, తదితరులున్నారు.

కొండాపూర్‌కు రోడ్డు వేయాలి

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని ముప్పిరెడ్డిపల్లి పరిశ్రమల వాడ నుంచి కొండాపూర్ గ్రామం వరకు రోడ్డు వేయాలని హైదరాబాద్‌లో పరిశ్రమల జోనల్ మేనేజర్ మాధవిని కొండాపూర్ గ్రామ ప్రజాప్రతినిధులు శుక్రవారం కలిసి వినతి పత్రం ఇచ్చారు. వీరిలో ఉపసర్పంచ్ వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకులు చింతల రవి, భాస్కర్, సత్యనారాయణ, యాదగిరితో పాటు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొల్చారం(నర్సాపూర్): బాలల హక్కులు, సామాజిక అంశాలపై కైలాస్ సత్యార్థి ఫౌండేషన్ సహకారంతో కార్పెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు దయాశీల, సత్యనారాయణ ఆధ్వర్యంలో పిల్లల అక్రమ రవాణా, బాల్యవివాహాలు, హక్కులపై విద్యార్థులకు వివరించారు. కొల్చారం ట్రైనింగ్ ఏఎస్ఐ వాణి, కళాశాల ప్రిన్సిపాల్ యతిరాజవల్లి, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

13న ఎస్సీ ఉపకులాల సమావేశం

నర్సాపూర్: నెల 13న మెదక్‌లో ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జిల్లా సమావేశం ఏర్పాటు చేశామని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి ఉమ్మడి మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరి చెప్పారు. 13న జరిగే సమావేశానికి జిల్లాలోని ఎస్సీ ఉపకులాల కులస్తులు పాల్గొనాలని కోరారు.

కబ్జాను అరికట్టండి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి గ్రామ శివారులో అనుమతులు తీసుకొని పాత పానాదిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, గ్రామ పంచాయతీకి హ్యాండోవర్ చేయాలని వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాలపై ఎంపీటీసీ–2 మోహన్‌రెడ్డిపై గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టులో కేసు వేయగా పనులు నిలిపివేశారన్నారు. కానీ మరలా శుక్రవారం పనులు ప్రారంభించారని ఆరోపించారు. నిర్మాణాలకు సంబంధించి కోర్టు నుంచి ఏవైనా అనుమతులు వచ్చినట్లయితే ఆ కాపీని గ్రామ పంచాయతీకి అందజేసి దర్జాగా నిర్మాణాలు చేపట్టుకోవచ్చన్నారు. లేనిపక్షంలో కోట్ల రూపాయలు విలువ జేసే స్థలాన్ని గ్రామ పంచాయతీకి అప్పగించాలన్నారు. అక్రమ నిర్మాణాలకు ఎమ్మెల్యే మదన్ రెడ్డి సహకరిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్ కృష్ణాగౌడ్, కృష్ణ, శివ్వాగౌడ్, మైసయ్య, మల్లేశం, యాదగిరి ఉన్నారు. ఈ విషయమై ఎంపీటీసీ–2 మోహన్‌రెడ్డిని వివరణ కోరగా.. కొందరు రాజకీయ కక్ష్యతోనే తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు.

సీసీ రోడ్లు ఎందుకు నిర్మించరు?



మాట్లాడుతున్న ఉపసర్పంచ్ రాములు

రేగోడ్(మెదక్): పాలకులు పక్షపాతంతో పాలిస్తున్నారని, సీసీరోడ్లు ఎందుకు నిర్మించడం లేదని సర్పంచ్‌పై ఉప సర్పంచ్, కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రం రేగోడ్‌లో సీసీ రోడ్లు నిర్మించడం లేదని నాలుగో వార్డులో ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ రాములు మాట్లాడుతూ.. నేను బీఆర్ఎస్ ఉప సర్పంచ్‌ను, నాలుగేళ్లుగా సీసీ రోడ్లు వేయమని సర్పంచ్, ఎమ్మెల్యేకు చెప్పినా.. పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు చేయకపోతే ఓట్లకు ఎలా వస్తారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులకే లైసెన్స్ ఇవ్వాలి: పిట్ల



ఈతవనాల రైతు సంఘం నూతన కమిటీ సభ్యులు

శివ్వంపేట(నర్సాపూర్): చెట్టుపైకి ఎక్కి కల్లుగీసే కార్మికులందరికీ లైసెన్స్ ఇవ్వాలని తెలంగాణ ఈతవనాల రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు పిట్ల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని దొంతి గ్రామంలో ఈతవనాల రైతుసంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడిగా బాలేశ్, ఉపాధ్యక్షుడిగా లక్ష్మారెడ్డి, కార్యదర్శిగా శాదుల్లా, జాయింట్ కార్యదర్శిగా మాలోత్ బాలు, కోశాధికారిగా కృష్ణతో పాటు ఆరు మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

'కలిసి పనిచేస్తే అధికారం మనదే'



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: నాయకులు, కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేస్తే రాష్ట్రంలో, కేంద్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం అవుతుందని తెలంగాణ పీసీసీ ఉపాధ్యక్షుడు, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ గాలి అనిల్‌కుమార్ చెప్పారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో ఆయన సమక్షంలో చేరగా, వారందరికీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ పీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్, నాయకులు రవీందర్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, సురేశ్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా శివ్వంపేట మండలంలోని బిక్యాతండా, తుక్యాతండా గేంసింగ్ తండా, నానుతండాలకు చెందిన మాన్‌సింగ్, రెడ్యా, రాంచందర్, పాండ్య, రవీందర్ తదితరులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారని అనిల్‌కుమార్ వెల్లడించారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



నిజాంపేట(మెదక్): మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులకు ఆయిల్ పామ్ పంట సాగుపై మండల వ్యవసాయ అధికారి సతీశ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఆయిల్ ఫామ్ పంటలు సాగు చేయుటకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఎకరాకు 57 ఆయిల్ ఫామ్ మొక్కలు సబ్సిడీ ద్వారా ఇవ్వనున్నట్లు తెలిపారు. సబ్సిడీ ద్వారా డ్రిప్ ఇరిగేషన్, సంవత్సరానికి అంతర పంటల సాగు నిర్వహణకు 4,200 చొప్పున ఇస్తుందన్నారు. 4 ఏళ్లకు మొక్కలు కాతకొస్తాయన్నారు. ఆయిల్ ఫామ్ మొక్కల్లో అంతర పంటలుగా వేరుశనగ, పత్తి మొక్కజొన్న, కూరగాయలు తదితర పంటలు వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలత, రైతులు మాధవారెడ్డి, రామచంద్రారెడ్డి, కిష్టయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ రైతులకు అయిల్‌పామ్ పంటసాగుపై ఏఈఓ రమ్య శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులకు ప్రభుత్వం ఎకరాకు 57 మొక్కలు 90 శాతం సబ్సీడీపై అందిస్తుందని, అదేవిధంగా మొదటి నాలుగు సంవత్సరాల నిర్వహణ ఖర్చు, ఎకరానికి సంవత్సరానికి రూ.4,200 అందించడంతో పాటు, డ్రిప్ ఇరిగేషన్ సైతం రాయితీపై ఇస్తారని తెలిపారు.

అల్లాదుర్గం(మెదక్): ఆయిల్ పామ్ పంటలు సాగు చేస్తే అధిక ప్రయోజనాలు పొందొచ్చని ఏఓ రాజేశ్ చెప్పారు. శుక్రవారం గడిపెద్దాపూర్ రైతు వేదికలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్ ఫాం సాగు చేసినప్పటి నుంచి 30 ఏళ్ల వరకు ఆదాయం వస్తుందన్నారు. పంట సాగుకు ప్రభుత్వ రాయితీలు కల్పిస్తుందని తెలిపారు. పంట ఫలసాయం మధ్య దళారీలు లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కంపెనీ వారి కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించిన వారిలో ఏఈఓ దివ్యశ్రీ, ఏఈఓలు రాజశేఖర్‌గౌడ్, సృజన తదితరులు ఉన్నారు.

హవేళీఘనపూర్: ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం 90శాతం సబ్సిడీ ఇస్తున్నందున రైతులు ఆయిల్ ఫామ్ సాగుకు ఆసక్తి చూపాలని ఏఓ నాగమాధురి అన్నారు. మండల కేంద్రం రైతువేదికలో అవగాహన కల్పించారు.

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రం కొల్చారంలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించిన వారిలో ఏఈఓ ప్రతిభ, రైతులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



బుజ్రాన్‌పల్లిలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెద్దశంకరంపేట(మెదక్): మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు గుంతలు తీసే పనులను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత గ్రామ కార్యదర్శులు, ఈజీఎస్ అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ సుధాకర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సన్మానం

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో శుక్రవారం వార్డు వాసులు, మాల సంఘం ప్రతినిధులు మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, సహకార సంఘం చైర్మన్ చంద్రం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నాగరాజు, కౌన్సిలర్ అనిల్ కుమార్‌ను సన్మానించారు.

◆ పోస్టాఫీస్‌లో జాతీయ పతాకాల విక్రయాలు

కొల్చారం(నర్సాపూర్): ఈనెల 15 భారత దేశ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని రంగంపేట సబ్ పోస్టాఫీస్‌లో శుక్రవారం నుంచి జాతీయ పతాకాల విక్రయాలు చేపట్టారు. ఒక్కోటి రూ.25కు అందజేస్తున్నట్లు తెలిపారు.

◆ చలో హైదారాబాద్‌ను జయప్రదం చేయండి

పాపన్నపేట(మెదక్): కంట్రిబ్యూటరీ పింఛన్ రద్దు కోసం శనివారం తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమం జయప్రదం చేయాలని టీఎస్‌పీఎస్ ఈయూ నాయకులు దేవయ్య కోరారు. శుక్రవారం అయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఇందు కోసం శనివారం నాంపల్లి మైదానంలో జరుగబోయే సభను విజయవంతం చేయాలని కోరారు. రవీందర్, పరందాములు, రవి, శ్రీనివాస్, భాత్యమతి, అశోక్, రఫీ ఉన్నారు.

◆ బీమా చెక్కు అందజేత

తూప్రాన్: పట్టణంలోని యూనియన్ బ్యాంకు ఉద్యోగి కుటుంబానికి శుక్రవారం ఆ బ్యాంకు సిద్దిపేట రిజినల్ మేనేజర్ వికాస్ రూ.52 లక్షల చెక్కును అందజేశారు. తమ బ్యాంకులో ఉద్యోగిగా పని చేసిన కేశవరావు గత నెల 21న మృతి చెందాడన్నారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి ఇన్సూరెన్స్ డబ్బులు రూ.52 లక్షల చెక్కును అందజేశామన్నారు. బ్యాంకు ఉద్యోగులు రాఘవ, సమద్‌ఖాన్, గణేశ్‌నాయక్, పాల్గొన్నారు.

◆ కొనసాగుతున్న దీక్షలు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ కోసం పట్టణంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు శుక్రవారానికి 138 రోజులకు చేరుకున్నాయి. తాము దీర్ఘకాలంగా దీక్షలు చేస్తున్నా.. ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడంలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

◆ ఉచిత శిబిరాలు

చేగుంట(తూప్రాన్): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలో ఉచిత వైద్యశిబిరంతో పాటు డయాబెటీస్ పరీక్షలను నిర్వహించారు. చేగుంట యశోద ల్యాబ్‌లో 27 మందికి ఉచిత డయాబెటీస్ పరీక్షలు, రెడ్డిపల్లి కాలనీలో మల్లారెడ్డి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి మందులను అందించారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు అనీల్, కార్యదర్శి నాగరాజు, సీనియర్ సభ్యులు నాగరాజు, సూర్యప్రకాశ్, సుఖేందర్, మల్లారెడ్డి ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

◆ అదనపు కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్మన్లు

రామాయంపేట(మెదక్): రామాయంపేట, మెదక్ మున్సిపల్ చైర్మన్లు జితేందర్‌గౌడ్, చంద్రపాల్ శుక్రవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లును కలిసి, సన్మానించారు. ఈ సందర్భంగా రెండు మున్సిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వారు వివరించారు.

◆ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

వెల్దుర్తి(తూప్రాన్): గ్రామ పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ స్వరూపారెడ్డి, జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్ అన్నారు. మండలంలోని ఆరెగూడెం గ్రామ శివారులో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా నిర్మించిన వైకుంఠధామాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆ నేడు టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

కొల్చారం(నర్సాపూర్): ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యల సాధనకై ఉద్యమంలో భాగంగా నేడు మెదక్ పట్టణంలో యూఎస్పీసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టీపీటీఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షుడు సంగయ్య, కార్యదర్శి వెంకట్ రామ్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మార్కెట్ కమిటీ ఖమ్మం నుంచి గుల్షన్ క్లబ్ వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నాలని కోరారు.

◆ జాతీయ భద్రతపై వ్యాస రచన పోటీలు

మనోహరాబాద్(తూప్రాన్): ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా విద్యార్థులకు జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ భద్రత – జీవితానికి రక్షణ అనే అంశంపై శుక్రవారం నిర్వహించారు. మండలంలోని రామాయపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సడక్ సురక్ష – జీవితానికి రక్ష, జాతీయ భద్రత – జీవితానికి రక్షణ అంశాలపై వ్యాస రచన పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జీఎమ్మార్ ప్రతినిధి శ్రీనివాస్, హెచ్‌ఎం నాగలత, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

◆ కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



రామాయంపేట(మెదక్): కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిరుపేదలకు వరంగామారాయని నార్సింగి ఎంపీపీ చిందం సబిత, జెడ్పీటీసీ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం నార్సింగి మండల కేంద్రంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి పథకం కింద చెక్కులు అందజేశారు. మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు లింగారెడ్డి, సర్పంచ్ అశోక్, ఎంపీటీసీలు సత్యనారాయణ, సుజాత మల్లేశంగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మైలారం బాబు, ప్రధాన కార్యదర్శి అంచనూరి రాజేశ్, సీనియర్ నాయకులు మల్లేశంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

◆ గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేయాలి

నర్సాపూర్: గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేయాలని ఎస్ఎఫ్‌యూఐ జిల్లా కోఆర్డినేటర్ ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలతో కలిసి పట్టణంలో ర్యాలీ తీసి చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు నవీన్‌కుమార్, ప్రశాంత్, ప్రసాద్, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ కాయిదంపల్లిలో త్రిష పర్యటన

అల్లాదుర్గం(మెదక్): మండలంలోని కాయిదంపల్లి గ్రామంలో మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ కూతురు త్రిష శుక్రవారం పర్యటించారు. ఇంటింటికీ మీ ఆడబిడ్డ అనే కార్యక్రమంలో భాగంగా ఆమె గ్రామాల్లో తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు.